# ఆడపిల్ల

పండక్కి కూతురూ, అల్లుడూ వస్తున్నట్లు రాసిన ఉత్తరం చూసిన దగ్గరనుంచి సన్యాసిరావు, శేషమ్మల గుండెల్లో బండరాయి పడినట్లుంది. నాలుగు నెలల క్రితమే పెళ్లిచేసి కూతుర్ని అత్తవారింటికి పంపేరు. ఆ వెంటనే వచ్చిన పండక్కి పిలిస్తే తట్టుకోలేమని తెలిసినా, రాకుండా వుంటే బాగుండుననుకుంటూనే లాంఛనానికి ఉత్తరం రాశారు అల్లుడికి. తనూ, భర్తా బయలుదేరి వస్తున్నట్లు తిరుగుటపాలోనే కూతురు రాసిన ఉత్తరం అందుకున్న దగ్గరనుంచీ ఆ భార్యాభర్తల కంగారు ఇంతా అంతా కాదు.

కొడుకు సుకుమార్ సి.ఎ. చదువుకి పొలం అమ్మేశారు. వెంటనే బొంబాయిలో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. పెళ్లికూడా అయిపోయింది. ఆ వెంటనే మానస పెళ్లి కుదిరింది. కొత్తగా ఉద్యోగంలో చేరిన కొడుకు పట్నంలో నిలదొక్కుకోవడం కష్టమని పెళ్లికి డబ్బు పంపలేదని తెలిసిన సన్యాసిరావు వేరే ఆధారంలేక కూతురి పెళ్లికి ఇల్లు తాకట్టుపెట్టక తప్పలేదు. కొడుకు కాస్త సెటిలవగానే పంపే డబ్బుతో ఇల్లు విడిపించుకోవచ్చునుకున్నాడు.

మళ్ళీ ఇంతలోనే కూతురూ అల్లుడూ వస్తే ఎంత లేదన్నా వెయ్యి రూపాయల ఖర్చు తప్పదు. 'ఎవరినడుగుతాం? ఎవరిస్తారు?' అన్నదే వారి మనోవేదన. ఎంతో ఆలోచించినమీదట చివరికి కొడుకొక్కడే తమ బాధని అర్థం చేసుకోగలడనిపించి వివరంగా ఉత్తరం రాసి వెంటనే వెయ్యో, పదిహేనొందలో పంపవలసిందిగా రాశారు.

పండుగ రెండు రోజులుండనగా దిగారు మానస, మనోహర్‌లు. వచ్చిన దగ్గరనుంచి ఇల్లంతా కలయదిరిగేస్తూ, "మీ అల్లుడికి ఇవి ఇష్టం, అవి ఇష్టం" అంటూ తల్లి వెనక తిరుగుతూ అత్తింటి కబుర్లు చెప్తోంది మానస.

తొలిసారి పుట్టింటికొచ్చిన కూతురులో ఆ దంపతులకి చాలా మార్పు కనిపిస్తోంది. ఒంటినిండా పెట్టుకున్న నగలతో వచ్చిన నిండుదనంతోపాటు పెద్దింటికోడలన్న హుందాతనం మాటల్లో, నడతలో కనబడుతోంది.

తీర్చి దిద్దినట్లుండే మానసని సన్యాసిరావు బంధువుల పెళ్లిలో చూసి మనోహర్‌పెళ్లి చేసుకుంటాననడంతో మనోహర్ తల్లిదండ్రులు మధ్యవర్తులద్వారా సన్యాసిరావుకి కబురు పంపి, లాంఛనప్రాయంగా పిల్లని చూసి, కట్నకానుకలు అక్కరలేదని లాంఛనాలు జరిపించి పెళ్లిమాత్రం ఘనంగా చెయ్యాలని అనడంతో సన్యాసిరావు కాదనలేకపోయాడు.

మనోహర్ బ్యాంక్‌లో ఆఫీసర్. తల్లిదండ్రులకి ఒక్కడే కొడుకు. అతని ఆనందమే తమ ఆనందంగా భావించే మనోహర్ తల్లిదండ్రులు, కొడుకు ఇష్టపడిన పిల్లతోటే అతని వివాహం జరిపించాలని నిశ్చయించారు.

ఇటు – తమ తాహతుకిమించిన సంబంధం మానసకి వచ్చిందన్న ఆనందం ఆమె తల్లిదండ్రులలో లేకపోలేదు. కానీ కూతుర్ని కొడుకుతో సమానంగా చదివించినా అధికంగా అరవైవేలదాకా పెళ్లికి ఖర్చు చెయ్యక తప్పదు. కొడుకు పెళ్లికి వాళ్ళిచ్చిన కట్నం డబ్బులే ఖర్చుచేశారు. ఈ రోజుల్లో ఆడపిల్లకీ చదువులూ చెప్పించాలి, వేలకి వేలు ఖర్చుచేసి పెళ్లిళ్లూ చెయ్యాలి. ఇప్పుడు ఈ ఆడపిల్లల చదువుల ఖర్చు అదనం అన్నదే మానస తల్లిదండ్రుల బాధ.

డబ్బులేదని ఆ సంబంధం వదులుకుంటే, చేతిలో డబ్బున్నప్పుడు ఇంతటి సంబంధం తాము తేలేమని తెలిసిన సన్యాసిరావు, ఇంటిమీద అప్పుతెచ్చి మానస పెళ్లిచేసి బాధ్యత తీరిందనుకున్నాడు. కానీ తీరలేదని ఇప్పుడే తెలుసుకున్నాడు.

"పెళ్లవగానే పండుగ వచ్చింది. తరువాత ఆషాఢం వస్తోంది, ఆపైని ఏ సూడిదలో వస్తాయి, ఆ తరవాత బారసాల... ఇలా ఇవన్నీ తల్చుకుంటుంటే గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. తనకా పెన్షన్ డబ్బులు తప్ప వేరే రాబడి లేదు. మరి ఇలా వచ్చిపడే ఖర్చుల్ని ఎలా తట్టుకోడం?" అన్న బెంగతో మనిషి భయంభయంగా కూతుర్ని, అల్లుడినీ వీలయినంతవరకు తప్పించుకుని తిరుగుతున్నాడు.

"ఏం వండుతున్నావు?" అంటూ మార్కెట్‌నుంచి అరువడిగి తెచ్చిన సరుకులు అందిస్తూ భార్యనడిగాడు సన్యాసిరావు.

"వంకాయ కారంపెట్టిన కూర, సాంబారూ చెయ్యమని మీ కూతురు చెప్పింది. మీ అల్లుడిగారికి వేపడాలు తప్ప సయించవుట. నిమిష నిమిషానికీ వచ్చి మొగుడికి కావలసినవి చెప్పి వెళ్తోంది. అప్పడాలు తెచ్చారా? ఆయనకి రోజూ వుండాలిట"

"ఉష్... వింటారే మెల్లిగా"

"లేరులెండి, స్నేహితురాలు రత్న ఇంటికి వెళ్ళొస్తామని వెళ్ళారు. అయినా అది ఈ ఇంట్లో పుట్టలేదా? ఇరవై రెండేళ్లు ఈ ఇంట్లో పెరిగిన దానికి తండ్రి స్థితిగతులు తెలీవా? అది పెద్దింటి కోడలవగానే మన దశా మారిపోతుందనుకుందా? అన్నీ తెలిసికూడా 'నా మొగుడికి ఇవి చెయ్యి, అవి చెయ్యి – ఇది తినరు, అది తినరు' అంటూ పీక్కుతింటుందేమిటి? ఎక్కడినుంచి తెస్తామనుకుంటోంది?"

"అయినా ఈ ఆడపిల్లలింతే. ఎంతపెట్టినా చాలదు. పుట్టిల్లు గుల్లవుతోన్నా పట్టించుకోరు. చిన్నప్పటినుంచీ దాని స్వభావమే అంత. మగపిల్లవాడుకదా అని వాడికేదన్నా కాస్త ఎక్కువపెడితే తెగ బాధపడిపోయేది. 'వాడిని చదివించారు నన్నెందుకు చదివించ'రని మొండికేసి తిండీ, తిప్పలూ మాని ఎం.ఏ.లో చేరలా? 'అయ్యో మగపిల్లవాడు వాడేకదా రేపు అమ్మానాన్ననీ పోషించేది. పరాయి ఇంటికెళ్లి నేనేం చెయ్యగల'నని ఆలోచించిందా?" అంటూ సణుగుతున్న భార్యతో సన్యాసిరావు అన్నాడు–

"ఊరుకోవే వస్తే బాగోదూ, ఎన్నన్నా తప్పదుకదా? ఎలాగో ఈ గండం గట్టెక్కి వాళ్ళు వెళ్తే చాలు. అవునుగానీ తిరుగుప్రయాణం ఎప్పుడో ఏమన్నా చెప్పిందా?"

"ఆ చెప్పింది. పండుగెళ్ళిన మర్నాడేట. వాళ్ళాయనగారికి సెలవులేదుట"

"రక్షించారు. గుడ్డిలో మెల్ల. అదో శుభవార్తే"

"ఎవరో వచ్చారులాగుంది చూడండి" అంటున్న శేషమ్మ దగ్గరకే మానస వచ్చి, "అమ్మా! ఏమన్నా సహాయం చెయ్యనా?" అనగానే, "వద్దు తల్లీ! మీవారితో కబుర్లు చెప్పు" అంది కోపాన్ని లోలోనే అణుచుకుంటూ.

సన్యాసిరావు, శేషమ్మలకి లేచిన దగ్గరనుంచీ గాబరాగానే వుంది. రేపే పండుగ. ఈరోజన్నా కొడుకు డబ్బు పంపకపోతే ఏంచెయ్యాలి? ఎవరినడగాలి? అని కంగారుపడుతున్నారు. రోజూలాగే ఈ రోజూ చూస్తుండగానే పోస్టుమేన్ ఇంటిముందునుంచి వెళ్లిపోయాడు. భార్యాభర్తలిద్దరూ వెర్రివాళ్ళల్లా ఒకరినొకరు చూసుకున్నారు.

"ఆదినారాయణ ఇంటికెళ్ళి ఓ అయిదొందలు అడిగి చూస్తాను," అన్నాడు సన్యాసిరావు నెమ్మదిగా.

"మొన్న లేవన్నవాడు ఈవాళెలా ఇస్తాడండీ! మీ వెర్రిగానీ" అంటూ విసుక్కుంది శేషమ్మ.

"అయితే ఎవర్నడగమంటావు?" అన్నాడు కోపంగా. "అయినా పదిరోజుల క్రితమనగా రాశాంకదా? ఎలాగో సర్ది కనీసం వెయ్యిరూపాయలన్నా పంపొద్దూ వాడూ" అన్నాడు మళ్ళీ సన్యాసిరావు.

"వాడికేం ఇబ్బందో ఆలోచించుకోకుండా అనేస్తారేమిటి? మొన్ననేకదా? ఉద్యోగం వస్తే! అయినా ఈ రోజుల్లో టపాలు కూడా అలాగే వున్నాయి. ఉత్తరాలు అందవు. అందినా పదేసి రోజులు పట్టడం. అయినా అత్తమీద కోపం దుత్తమీదన్నట్లు వాడిమీద విరుచుకుపడతారేమిటి? మొన్ననే నాన్నకి బోల్డు ఖర్చయింది వెంటనే పండక్కి వెడితే ఏం పెడతాడు? ఎలా పెడతాడు? అని ఆలోచించని కూతుర్ని అనక" అంటూ కొడుకుని వెనకేసుకొచ్చింది శేషమ్మ.

మార్కెట్నుంచి వచ్చిన కూతురూ, అల్లుడూ చేతిలో పేకెట్లు బల్లమీద పెట్టి ఒకటొకటే విప్పసాగారు. తను కొనుక్కున్న చీరలు, గాజులు, భర్తకి కొన్న బట్టలు తల్లిదండ్రులకి చూపించినమీదట చిన్న పేకెట్ విప్పి గోల్డుకలర్ చెయినుతో ఉన్న వాచీని వారికి చూపిస్తూ, "నాన్నా! ఈ వాచీ బాగుందా? మీ అల్లుడు చాలాకాలంగా ఈ వాచీ కొనుక్కోవాలని సరదాపడుతుంటే నేనే కొనుక్కోనివ్వలేదు. పండక్కి మీరు ఏదో పెడతారుగా! అప్పుడు మావాళ్ళని ఈ వాచీయే కొనమంటానని అంటే ఆగారనుకోండి."

"ఇదిగో ఈ చీర చూశారా? మైసూర్ సిల్కు చీర పన్నెండొందలు. ఇవి మీరు మీ అల్లుడికి పెట్టే బట్టలు అయిదొందలు. మనకి తెలిసిన కొట్లోనే ఖాతాలో రాయించి తెచ్చాను. వారం రోజుల్లో మా నాన్న ఇచ్చేస్తారంటే సరే అన్నాడు" అంటూ చూపించిన వాచీని, బట్టల్ని చూడగానే మానస తల్లిదండ్రుల ముఖాలు పాలిపోయాయి.

'సుమారుగా మూడువేల రూపాయల సామాను – అడగా పెట్టకుండా తెచ్చేసుకుంది – అసలీపిల్లకి కాస్తన్నా జ్ఞానముందా? తల్లిదండ్రుల స్తోమత తెలిసుండీ ఎలా కొనుక్కొచ్చింది? !' అన్న చిరాకు, కోపం ఇద్దరిలో కలిగాయి. అల్లుడెదురుగా ఏమీ అనలేక, లేని సంతోషాన్ని కనబర్చుకుంటూ – "బాగున్నాయమ్మా" అన్నారిద్దరు.

"ఎంత వద్దన్నా వినలేదు మామయ్యగారూ! మా నాన్న ఎలాగూ పెడతారు, మన్నే కావలసినవి తెచ్చుకోమన్నారంటూ బలవంతంచేస్తే కొనుక్కున్నానండీ!" అన్న అల్లుడి మాటలకి – "మంచిపని చేశారోయ్! ఎలాగూ మేం కొనాలనుకున్నాం. అదే అమ్మాయితో అన్నాం" అన్నారు కూతురాడిన అబద్ధానికి తనో అబద్ధాన్ని జోడించి.

పండుగరోజు మామగారు పెట్టిన వాచీ మనోహర్ పెట్టుకుని, తల్లి పెట్టిన చీర మానస కట్టుకుని సినిమాకి వెళ్ళొస్తామంటూ బయలుదేరారు మానస, మనోహర్లు.

పండుగన్న ఉత్సాహం సన్యాసిరావు దంపతుల్లో ఎక్కడా కనబడటం లేదు. కూతురు నెత్తిన పెట్టిన ఈ అప్పుని ఎలా తీర్చడమా? అన్నదే ఆ ఇద్దరి బెంగ.

వాళ్ళిద్దరూ గేటు దాటగానే సన్యాసిరావు దంపతులు మళ్ళీ కూతుర్ని దుమ్మెత్తి పొయ్యసాగారు.

"కనీసం మనతో ఒక్క మాటన్నా అనకుండా అంత ఖరీదైన వాచీ, బట్టలు తెచ్చేసింది - ఏమిటనుకుంటోందీ పిల్ల?" అంటూ శేషమ్మ.

"సుకుమార్ పంపకపోతే ఎవరివో కాళ్ళూ కడుపు పట్టుకుని ఓ అయిదొందలు తెచ్చి ఇద్దర్నీ బట్టలు కొనుక్కోమందామనుకుంటే ఏకంగా మూడువేలదాకా అరువెట్టించిందా? పైగా నేను కొనుక్కోమన్నానని అబద్ధం కూడా ఆడింది - అదికూడా మనెదురుగుండానే" అంటూ సన్యాసిరాజు.

ఇలా సాగుతున్న వారి సంభాషణ, "అమ్మా! టిక్కెట్టు దొరకలేదే" అంటూ ప్రవేశించిన కూతురి మాటలతో బ్రేకేసినట్లు ఆగిపోయింది.

"అల్లుడేడే!" అని అడిగిన తల్లి ప్రశ్నకి - "ఆటోకి డబ్బిచ్చి వస్తున్నారు. చిల్లర లేదని పక్క కొట్లోంచి తెస్తానని వెళ్ళాడు ఆటోవాడు" అన్న కూతురి మాటలకి తల్లిదండ్రులిద్దరూ ఒకరిముఖాలొకరు చూసుకున్నారు. కారణం మానస ఒంటరిగా వచ్చి వుంటే చీవాట్లెయ్యాలనుకున్న వారికి అవకాశం దొరకనందుకు.

మర్నాడు కూతురూ అల్లుడూ రైలెక్కగానే సన్యాసిరావు, శేషమ్మలు ఉసూరుమంటూ నట్టింట్లో చతికిలపడ్డారు.

"అబ్బాయి ఇవాళో రేపో ఎంతో కొంత డబ్బు పంపిస్తాడులెండి - అలా బెంగెట్టుకోకండి. కొన్ని అప్పులన్నా దాంతో తీర్చి మళ్ళీ పంపమని రాద్దాం" అంది శేషమ్మ భర్తని జాలిగా చూస్తూ.

"ఏం చెయ్యగలంలే - అబ్బాయి వెయ్యన్నా పంపిస్తే రెండు కొట్లల్లో కొంత కొంతిచ్చి మళ్ళీ నెల్లో మిగిలింది ఇస్తామని చెబ్దాము" అన్నాడు సన్యాసిరావు.

కొండంత ఆశ, నమ్మకంతో ఎదురుచూస్తున్న ఆ దంపతుల పేర మానస వెళ్లిన నాలుగు రోజులకి పోస్టులో రెండు కవర్లు వచ్చాయి. అందులో ఒకటి రూపాయ బేరింగ్‌తో రావడంతో కవరు ఎవరిదా అని వెనక్కి తిప్పి చూశాడు. మానస అడ్రస్ వుంది.

"వచ్చి పీడించి, పిప్పి చేసింది కాకుండా ఇది రాసే ఉత్తరాలకి కూడా బేరింగులు" అని తిట్టుకుంటూ రూపాయ కాసిచ్చి, రెండో ఉత్తరం వెనక పేరు చూసి "అబ్బాయి రాశాడే!" అన్నాడు సన్యాసిరావు ఆనందంతో.

"ముందా ఉత్తరం చింపండి. డ్రాఫ్టో, చెక్కో పంపివుంటాడు" అంటూ తొందరచేసింది శేషమ్మ.

క్షేమసమాచారాల తరువాత కోడలికి మూడో నెలని, నెల తప్పినదగ్గరనుంచీ చాలా నీరసంగా వుండటంతో డాక్టరు మందులు, టానిక్కులూ ఇస్తున్నాడని రాసిన శుభవార్త చదవగానే ఆ దంపతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరియడమే కాకుండా, అప్పుడే మనుమడిని ఎత్తుకున్నంత సంబరపడిపోయారు. అన్ని విశేషాలూ రాశాక చివరగా రాసిన విషయం –

"నాన్నగారూ! మీరు డబ్బు పంపమని రాశారు. ప్రస్తుతం మీ కోడలి అనారోగ్యంవల్ల చాలా ఖర్చులో వున్నాను. పైగా బొంబాయిలో ఖర్చుల గురించి మీకు రాయనవసరంలేదు. ఒక్క పైస మిగల్దు. రేపు చంటిపిల్లాడితో ఈ జీతంతో ఎలా బతకాలో అర్థంకావటంలేదు. అందుకని ఏమీ పంపలేకపోతున్నాను. మన్నించండి. మీకో విషయం రాస్తున్నాను. సాహసించి మీకీ సలహా ఇస్తున్నందుకు మన్నించండి. మీరు తాకట్టుపెట్టిన ఇల్లు అమ్మేసి, అక్కడి అప్పులు తీర్చేసి మీరూ, అమ్మా బోంబే వచ్చెయ్యండి. మీరు మా దగ్గరుంటే మాకు సహాయంగా వుంటారు. ఇక్కడ పనివాళ్ళు దొరకరు, దొరికినా వందల జీతాలివ్వాలి. మీ కోడలు ఈ పరిస్థితిలో ఏమీ చేసుకోలేకపోతోంది. నాది ప్రైవేటు కంపెనీ కావడంతో టైముండక బయటి పన్లు ఏమీ చెయ్యలేకపోతున్నాను. మీరిద్దరూ మా దగ్గర వుంటే అమ్మా, కోడలూ ఇంట్లో పనులు, మీరు బయటి పనులు చూస్కోవచ్చు. ఇల్లు అమ్మితే రెండు లక్షల పైనే వస్తాయి. అప్పులు తీర్చగా మిగిలిన సొమ్ము బ్యాంక్‌లో వేసుకుంటే వడ్డీ వస్తుంది. ఇక్కడ పగిడీలు ఇచ్చుకోలేక ఓ గదిలో చాలా అవస్థపడుతున్నాం. ఆ డబ్బులో కొంత పగిడీ ఇచ్చి కాస్త పెద్దిల్లు కూడా తీసుకోవచ్చు. ఆ ఇంటిమీద మీకుండే మమకారం తెలిసి కూడా ఇలా రాయడానికి కారణం ఇక్కడి మా ఇబ్బందులేను" అంటూ రాసిన ఉత్తరం చదివి సన్యాసి రావు ముఖం వివర్ణమవసాగింది. గొంతులో ఏదో అడ్డుపడినట్లు మాటలురాక ఒకరినొకరు చూసుకోసాగారు.

"ఆ తల్లి ఏం రాసిందో చూడండి!" అంది కాస్త తేరుకోగానే శేషమ్మ. మానస ఉత్తరం చింపి చదవసాగాడు సన్యాసిరావు.

"పూజ్యులు నాన్నగారికి, అమ్మకి –

అనేక నమస్కారాలు. మేము నిన్న కులాసాగా చేరాము. దిగిన దగ్గరనుంచీ మీ అల్లుడు మీరు చేసిన మర్యాదలు మావాళ్ళందరికీ తెగ చెప్తున్నారు. మా అత్తగారు - 'పండక్కి మీ అత్తారేం పెట్టా'రని అడగ్గానే ఎంతో గర్వంగా వాచీ, బట్టలూ చూపించారు. నేను చీర చూపించాను. 'మీ మామగారిచేత అంతెందుకు ఖర్చు పెట్టించార'ని మా మామగారు ఈయన్ని చీవాట్లు కూడా వేశారు" అన్న వాక్యం పూర్తికాకుండానే, "మా నాన్నని పీకదాకా ముంచానని కూడా చెప్పలేకపోయావా తల్లీ!" అంటూ చేతులు తిప్పుకుంది శేషమ్మ.

"అబ్బా! ఉండు ఉత్తరం చదవనీ" అంటూ మళ్ళీ ప్రారంభించాడు సన్యాసిరావు.

"అమ్మా! నాన్నగారూ! మీరిద్దరూ నన్ను మనస్ఫూర్తిగా క్షమించాలి". "అబ్బా ఎందుకో ఈ క్షమాపణలు?" మళ్ళీ అందుకున్న శేషమ్మ మీద విసుక్కుంటూ "పూర్తిగా చదవనివ్వవే!" అంటూ చదవసాగాడు సన్యాసిరావు.

*"నాన్నగారూ! మీ కష్టసుఖాలు తెలిసుండీ నేను అంత ఖరీదైన వాచీ, బట్టలూ కొని తెచ్చానని మీరిద్దరూ బాధపడ్డారుకదూ? నిజంగా మిమ్మల్ని ఇబ్బందిపెట్టడం నా ఉద్దేశం కాదు. మా అత్తవారి దగ్గర మీ గౌరవం కాపాడాలన్నది నా ఉద్దేశం. అందుకు మీతో మాట మాత్రానికయినా చెప్పకుండా అన్నీ కొని తెచ్చాను. ఆ విషయమై మీరు ఎంత బాధపడ్డారో నాకు తెలుసు. మీరే కొనుక్కోమన్నారని అబద్ధంకూడా ఆడేను. నేను చేసిన ఈ తప్పు పనులకి క్షమాపణ అడుగుతున్నాను.*

*ఇదికాక మరో పెద్ద తప్పు కూడా చేశాను. ఇది అక్కడ మీతో చెప్తే బాధ పడతారని ఉత్తరంలో రాస్తున్నాను. బీరువామధ్య అరలో బట్టలకింద కవర్లో నాలుగు వేలరూపాయలు పెట్టాను. అవి పెళ్ళిలో నాకు అంతా ఇచ్చినవి + మావారు నెల నెలా 'నీ పాకెట్ మనీవోయ్!' అంటూ ఇచ్చే డబ్బు. అదంతా దాచి పండక్కి వస్తూ తీసుకొచ్చాను. మీరెంతో కష్టపడి కట్టుకున్న ఇల్లు తాకట్టుపెట్టి నా పెళ్ళిచేశారు. వెంటనే పండక్కి వస్తే మీకు బోల్డు ఖర్చని తెలిసినా మిమ్మల్ని చూడాలనిపించి వచ్చాను. అటు అత్తవారి దగ్గర మన హుందాతనం కనపడాలని అంత ఖరీదైన సామాన్లుకొని, ఇటు మిమ్మల్ని ఇబ్బంది పడనివ్వకుండా ఆ డబ్బు బీరువాలో పెట్టాను. ఆ డబ్బు తీసుకెళ్ళి నేను కొన్న సామాన్ల బాకీ తీర్చెయ్యండి. మిగిలిన డబ్బుతో మాకోసం చేసిన మిగతా అప్పులు కూడా తీర్చెయ్యండి. ఇలా రాస్తున్నందుకు మీరిద్దరూ నన్ను మనసారా మన్నించండి.*

ఇంకో విషయం. ఈమధ్య ఉత్తరాలు సరిగ్గా అందటంలేదని, ఈ ఉత్తరం తప్పక అందాలని తక్కువ స్టాంపులతో పోస్టుచేస్తున్నాను. జవాబు రాయండి.

ప్రేమతో

మీ మానస"

ఉత్తరం ముగించిన సన్యాసిరావు కళ్ళంట కారిన నీటిబొట్లు అశ్రుధారలో, ఆనందబాష్పాలో అర్థంచేసుకోవడం కష్టమయితే –

"ఆడపిల్ల ఆడపిల్లేనండీ! పాపం ఆడపిల్లని దాన్ని మొదటినుంచీ చులకనగానే చూశాం!అయినా దానికి పుట్టింటిమీద ఎంత ప్రేమో చూడండి!" అని నరంలేని నాలికతో తొలిసారిగా అంటూ కళ్ళొత్తుకుంటున్న భార్యవైపు చూసి, తప్పు చేసినవాడిలా తనూ తలంచుకున్నాడు సన్యాసిరావు.

స్వాతి వార పత్రిక

**3 ఏప్రిల్ 1992**